## క్లుప్తంగా

### సీజనల్ వ్యాధులపై అవగాహన



వైద్య శిబిరంలో విద్యార్థులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం చెర్లోపల్లి గ్రామంలో శుక్రవారం కూడా జాతీయ సేవా పథక కార్యక్రమం కొనసాగింది. ఇందులో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు సీజనల్ వ్యాధులపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అవగాహన కల్పిస్తూ ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. గ్రామస్తులను పరీక్షించి మందులు, మాత్రలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యబృందం దేవన్, సుజాత, ఎన్ఎస్ఎస్ అధికారి శైలజ , ప్రశాంతి పాల్గొన్నారు.

### నగరంలో తిరంగా ర్యాలీ



జెండాలతో ర్యాలీగా వెళ్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, మాజీ సైనికులు పాల్గొన్నారు. గాంధీ విగ్రహం వద్ద నుంచి ఎంఎస్ఆర్ సర్కిల్ మీదుగా ర్యాలీ చేశారు. మేయర్ అముద, జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు మాట్లాడుతూ, ప్రధాని మోదీ నాయకత్వంలో ఆడపడుచుల నుదుటున పసుపు కుంకుమలను చెరిపేసిన మానవ మృగాలను మట్టికరిపించి ప్రపంచ దేశాలకు భారత్ సైనికుల సత్తాను చాటారని కొనియాడారు. కార్యక్రమంలో చుడా ఛైర్మన్ హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, మాజీ ఎంపీ దుర్గా, నాయకులు శ్రీనివాసులు, సత్య తదితరులు పాల్గొన్నారు.

### శుభ్రతతో డెంగీ నివారణ



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గుడిపాల: పరిసరాల శుభ్రతతో డెంగీ వ్యాధిని నివారించవచ్చని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అర్థమయ్యేలా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, దోమలార్వా నియంత్రణ, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి జబ్బుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు దోమల పట్ల పలు జాగ్రత్తలు పాటించాలని, దోమ తెరలు వాడాలని, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాల సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ విజయ, ఏఎన్ఎమ్ జబ సెల్వి, చంద్రశేఖర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### వైద్య శిబిరంలో 95 మందికి వైద్య పరీక్షలు



పశుమందలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: గ్రామీణుల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని గుడిపాల, బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారులు సంధ్య, రష్మిత తెలిపారు. మండలంలోని పశుమంద, ఎఎల్ పురం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. 95 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, సుమతి, స్వరణ, ప్రవీణ్, కర్లీనా రీటా, సరస్వతి, సుజిమ, స్వప్నలు పాల్గొన్నారు.



ఏఎల్‌పురంలో సేవలందిస్తున్న డాక్టర్ రష్మిత








## నువ్వా-నేనా.?







రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు చిత్తూరు నగరంలోని మెసానికల్ మైదానం వేదికైంది. శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైన ఈ పోటీల్లో తొలిరోజు బాలురు, బాలికలు తలపడ్డారు. క్రీడాకారులు ఉత్సాహంగా నువ్వా నేనా అనే రీతిలో పోటీపడ్డారు. ఈ పోటీలను తిలకించడానికి క్రీడాభిమానులు తరలివచ్చారు. అయితే ఈ క్రీడాకారులకు కుస్తీ పోటీల నిర్వాహకులు సరైన వసతులు కల్పించలేదన్న విమర్శలు వెలువెత్తాయి. -చిత్తూరు కలెక్టరేట్

# భూసార పరీక్ష.. పంటకు రక్ష!

- మట్టి నమూనాల సేకరణలో మారిన విధానం
- భూసార పరీక్ష ఫలితాలతో ఎరువుల ఆదా

బంగారుపాళెం: వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెంచాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి అంటూ వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వాస్తవానికి 90 శాతం రైతులు పంటకు కావలసిన పోషక విలువలు తమ భూమిలో ఉన్నాయో లేదో తెలుసుకోకుండానే పంటల సాగు చేపడుతున్నారు. అధిక దిగుబడులు రావాలని రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా ఖర్చులు పెరగడం తప్ప దిగుబడుల్లో మార్పులు ఉండడం లేదు. అంతే కాక వేసిన ఎరువుల వల్ల భూమిలో సహజసిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి.



మట్టిని వేరు చేసే విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

**జీపీఎస్ విధానంతో మట్టి సేకరణ**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయంలో అమలు చేస్తూ రైతులకు మెరుగైన దిగుబడులు సాధించేలా జగన్ ప్రభుత్వం ముందుకు పోతోంది. ఇందులో భాగంగానే మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగాన్ని నియంత్రించడంతోపాటు రైతులకు పెట్టుబడి భారం తగ్గించేలా వ్యవసాయాధికారులు ముందుకు పోతున్నారు. భూసార పరీక్షల ఆధారంగా నేలలో ఉన్న పోషకాలను గుర్తించి, పంటల సాగు చేపట్టేలా రైతులను చైతన్య పరుస్తున్నారు. ఇందు కోసం జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం)ద్వారా మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**సూక్ష్మ పోషకాలే కీలకం**

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే తమనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్లనే భూమిలోని పోషకాలు నశించిపోతున్నాయి. పొటాష్‌ను ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు మొక్కకు అందకుండా పోతున్నాయి. ఫలితంగా జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతోంది. సూక్ష్మ స్థూల పోషకాలతో పాటు పిహెచ్(నైట్రోజన్) సేంద్రియ కర్బనాల స్థాయి కూడా చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన జహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 శాతం నుంచి 0.20 శాతం వరకు ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలుస్తోంది.

**మూడేళ్లకోసారి తప్పనిసరి**

పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలో భౌతిక, రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి, నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. ఈ ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తోంది. దీంతో దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. భూమిలో లోపించిన లవణాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వేసుకోవడం వలన పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

### మట్టి సేకరణలో జాగ్రత్తలు

- పొలంలో ఎరువులు వేసిన తరువాత నెల రోజుల వరకు, నీరు పెట్టిన తరువాత, నీడ పడే ప్రదేశాలు, ఎరువుల కుప్పలు, గట్లు, చెట్ల వద్ద మట్టి నమూనాలు తీయరాదు.
- పంటకోత తరువాత, వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు సేకరించాలి.
- పొలంలో వి ఆకారంలో 15-20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి అందులో పై పార నుంచి కింద వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి.
- పొలం మొత్తంగా 8-10 చోట్ల సేకరించిన మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి నాలుగు భాగాలు చేయాలి. అందులో ఎదుటి భాగాలను మాత్రమే తీసుకోవాలి. ఈ విధంగా మట్టి అర కిలో వచ్చే వరకు చేస్తూ ఉండాలి.
- ఇలా సేకరించిన మట్టిలో రాళ్లు, గడ్డివేర్లను వేరు చేసి నీడలో ఆరబెట్టాలి.
- మట్టి బాగా ఆరిన తరువాత ప్లాస్టిక్ బ్యాగ్‌లో గానీ పాలిథిన్ కవర్‌లో గాని నింపి రైతు వివరాలు రాసి భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి.
- మట్టి సేకరణకు స్థానిక రైతు భరోసా కేంద్ర సిబ్బంది సాయం తీసుకుంటే వారు రైతు పొలం వద్ద మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్ష కేంద్రాలకు పంపుతారు.



మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

**భూసార పరీక్షలతో మేలు**



భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు ఉంటాయి. భూసార పరీక్షలు చేసి మండలంలో రైతులకు కార్డులు అందించే కార్యక్రమం ప్రారంభించాం. ఈ ఏడాది కూడా భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో సారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుంది. -చిట్టిబాబు, మండల వ్యవసాయాధికారి, బంగారుపాళెం

### పరామర్శ



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: అనారోగ్యం బారిన పడిన వైఎస్సార్‌సీపీ నాయకుడిని శుక్రవారం ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, వైద్యులు సూచించిన జాగ్రత్తలపై ఆరా తీశారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, కో-ఆప్షన్ సభ్యులు అను, తదితర నాయకులు పాల్గొన్నారు.

### ఇళ్ల కూల్చివేతకు నోటీసులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కాణిపాకం సమీపంలోని అగరంపల్లిలో దళితుల ఇళ్లను కూల్చేందుకు నోటీసులు ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరదేశి ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత 43 ఏళ్లుగా స్థిర నివాసం ఉంటున్న దళితుల ఇళ్లు ఖాళీ చేసేందుకు రాజకీయ కుట్ర జరుగుతోందన్నారు. గ్రామకంఠం భూమిలో ఎస్సీలు ఇల్లు నిర్మించుకున్నారని, అయితే ఆ భూమిని చెరువుభూమిగా చూపించడం అన్యాయమని వాపోయారు. కలెక్టర్ స్పందించి గ్రామంలో విచారణ జరిపి ఎస్సీలకు న్యాయం చేయాలని ఆయన విన్నవించారు.

### గంగమ్మ హుండీ లెక్కింపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని పొన్నియమ్మ ఆలయంలో శుక్రవారం గంగమ్మ హుండీని లెక్కించారు. రెండు రోజుల పాటు జరిగిన గంగజాతరలో భక్తులు అమ్మవారికి కానుకలు సమర్పించారు. ఈ కానుకలను లెక్కించగా నగదు రూ.3,56,830, బంగారం 30 గ్రాములు వచ్చినట్లు జాతర నిర్వాహకులు పేర్కొన్నారు.

## శుభ్రతతోనే సీజనల్ వ్యాధుల నివారణ

చిత్తూరు అర్బన్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ఒక్కటే మార్గమని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చిత్తూరు నగరంలోని శాంతినగర్ కాలనీలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న చోటే డెంగీ జ్వరాలకు కారణమయ్యే దోమలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం ఇళ్లల్లో ట్యాంకులు, డ్రమ్ముల్లో నీళ్ల నిల్వ లేకుండా చేయడం, పరిసరాలను శుభ్రం చేసుకోవడం ద్వారా డెంగీను అరికట్టవచ్చని చెప్పారు. అనంతరం మురుగునీటి నిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



ఇంటి వద్ద నీటి నిల్వలు పరిశీలిస్తున్న కమిషనర్

## కనులపండువగా పుష్పపల్లకి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని దుర్గాంబ దేవస్థానంలో శుక్రవారం రాత్రి పుష్పపల్లకి సేవను కనులపండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మూలస్థానంలోని అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. తర్వాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన పల్లకిలో దుర్గమ్మను ఆశీనులు చేసి ఊరేగించారు. భక్తులు అడుగడుగునా హారతులు పట్టారు. ఈ ఊరేగింపు శనివారం కూడా కొనసాగనున్నట్లు ఈవో మునిశేఖర్ తెలిపారు.



పుష్పపల్లకిలో ఊరేగుతున్న దుర్గమ్మ

## కొనసాగుతున్న విచారణ

చిత్తూరు అర్బన్/ కాణిపాకం: చట్టవిరుద్ధంగా చేసిన లింగనిర్ధారణపై లోతైన విచారణ కొనసాగుతోంది. రెండు రోజుల క్రితం చిత్తూరు నగరంలో జరుగుతున్న లింగనిర్ధారణ గుట్టును కలెక్టర్ సుమిత్‌కుమార్ రట్టు చేశారు. ఈ వ్యవహారంలో పట్టుబడ్డ ముఠాను పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఈ ముఠా ఎన్ని ఏళ్లుగా నిర్ధారణ చేస్తున్నారు? ఇప్పటి వరకు ఎంతమందికి చేశారు..? గర్భిణులను ఏరకంగా ఇక్కడికి రప్పించుకుంటున్నారు..? ఎక్కడి నుంచి ఎక్కువ మంది వస్తున్నారు? తమిళనాడులో ఎవరెవరితో సంబంధాలున్నాయి? జిల్లా కేంద్రంలో ఎవరితో సంబంధాలున్నాయి? అబార్షన్లు ఎక్కడెక్కడ చేయిస్తున్నారు? ఇందులో ప్రైవేటు డాక్టర్ల హస్తం ఏమైనా ఉందా..? లేకుంటే ఈ ముఠానే అబార్షనే చేస్తోందా? ఇందుకు సంబంధించిన మెడిసిన్స్ ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారు..? నిర్ధారణకు, అబార్షన్‌కు ఎంత వసూలు చేస్తున్నారు? ఎవరెవరికి ఎంత వాటా వెళుతోంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఇందులో ఏమైనా మాముళ్లు ఇస్తున్నారా? అనే కోణంలో విచారణ జరుగుతోంది. దీని అనుసంధానంగా నడుస్తున్న కార్యకలపాలపై కూడా ఆయా శాఖ అధికారులు కలెక్టర్ ఆదేశాలతో విచారణకు దిగారు. 2014లో లింగ నిర్ధారణ కేసులో పట్టుబడిన వ్యక్తి ప్రస్తుతం పట్టుబడిన వారిలో ఉన్నట్లు తెలిసింది. పొన్నియమ్మ గుడివీధి, సుందరయ్య వీధిలోని పలు క్లినిక్‌లు వీళ్లకు అడ్డాగా మారినట్లు ఆరోపణలున్నాయి. అదే మాదరిగా చిత్తూరు జిల్లా కేంద్రంలో 6 అక్రమ నిర్వహణ కేంద్రాలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై పోలీసులు త్వరలో వివరాలను వెల్లడించనున్నారు.

### రాజస్థాన్ వాసి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో రాజస్థాన్‌కు చెందిన ఓం ప్రకాష్ (33) ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటనలో శుక్రవారం వెలుగుచూసింది. వన్ టౌన్ పోలీసుల కథనం మేరకు రాజస్థాన్‌లోని నాగోర్ జిల్లాకు చెందిన ఓం ప్రకాష్ పనుల కోసం చిత్తూరుకు వచ్చాడు. నగరంలోని ఎస్టేట్లో ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో రోజు కూలీగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా రాజస్థాన్ నుంచి తరచూ ఫోన్లు రావడం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో విసిగిపోయి సాంబయ్య కండ్రిగ వద్ద ఉన్న అద్దె ఇంట్లో పైకప్పుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జనసేన పార్టీ నేతల రౌడీయిజం తగదు

చిత్తూరు రూరల్: జనసేన నేతలు రౌడీయిజం చేసి, డ్యూటీలో ఉన్న స్టాఫ్‌నర్సుపై దాడి చేయడం సరి కాదని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వర్ రావు, కార్యదర్శి సులోచనలు ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఐరాల మండల పీహెచ్‌సీలో నైట్ డ్యూటీ చేస్తున్న స్టాఫ్ నర్సు శకుంతలపై జనసేన నేత నవీన్ దాడిచేయడం ముమ్మాటికి దారుణమన్నారు. ఆమె విధుల్లో ఉండగా ఈ దారుణానికి ఒడిగట్టడం తగదన్నారు. మద్యం తాగి నవీన్‌తోపాటు మరో ముగ్గురు వ్యక్తులు డ్యూటీలో ఉన్న శకుంతలతో పాటు ఆమెకు సాయంగా ఉన్న భర్తపై కూడా దాడి చేయడం సరికాదన్నారు. దీనిపై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని వారు ప్రకటనలో డిమాండ్ చేశారు.

### చిత్తూరులో జోరు వర్షం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలో శుక్రవారం రాత్రి జోరు వర్షం కురిసింది. రాత్రి 10.20 గంటల సమయంలో వర్షం ప్రారంభమైంది. దీనికితోడు ఈదురుగాలులు బలంగా వీచాయి. కురిసిన వర్షానికి రోడ్లంతా జలమయంగా మారాయి. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు తారెత్తించాయి. భరించలేని ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. రాత్రి 7గంటల సమయంలో ఉరుములు మెరుపులు మొదలయ్యాయి. అప్పటి నుంచి మేఘాలు పూర్తిగా కమ్ముకున్నాయి. తేలిక పాటి గాలులు వీచి రాత్రి 10.20 గంటల సమయానికి బలమైన ఈదుగాలులతో కూడిన జోరు వర్షం మొదలైంది. ఈవర్షాలు దక్కులు చేసుకోవడానికి అనుకూలమని రైతులు చెబుతున్నారు.



చిత్తూరులో వర్షం పడుతున్న దృశ్యం

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని గంగసారం ప్రాంతంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. ఓ ఫ్యాక్టరీలో పని చేస్తున్న గుడిపాలకు చెందిన శీను, బాబు ఇద్దరూ బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. ఎదురుగా వచ్చిన మినీ పాల వ్యాన్ వీరిని ఢీకొట్టగా ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గాయపడ్డ వారిని తమిళనాడులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

## తెలుగుదేశం పార్టీలో అధ్యక్ష పదవుల రగడ

కాణిపాకం: టీడీపీలో పూతలపట్టు, ఐరాల మండలాల అధ్యక్ష పదవుల కోసం పోటీ పడ్డారు. రెండు వర్గాలు బలనిరూపణకు దిగాయి. చివరకు ఎమ్మెల్యే పట్టుబట్టి అధ్యక్ష పదవులను ఏకగ్రీవం చేశారు. ఆశావహులు అబాసుపాలయ్యారు. చిత్తూరు నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం అధ్యక్ష పదవి ఎన్నికను నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు రాజన్, ఎమ్మెల్యే మురళీమోహన్ అధ్యక్షతన మండల అధ్యక్షులను ఎంపిక చేశారు. ఈ అధ్యక్ష పదవి ఎన్నిక ప్రకటించడంతో తమ్ముళ్లు రెండు వర్గాలుగా ఏర్పడ్డారు. ఎవరికి వారు జనసమీకరణ చేశారు. వాళ్ల బలాన్ని నిరూపించేందుకు కార్యాలయానికి వందలాది మందిని వెంటవేసుకుని వచ్చారు. అయితే పూతలపట్టులో దొరబాబు చౌదరి, మురళీ అధ్యక్ష పదవికి పోటీపడ్డారు. రెండు పర్యాయాలుగా దొరబాబు అధ్యక్షులుగా ఉన్నారని, కొత్త వారికి అవకాశం ఇవ్వాలంటూ మురళీ వర్గం పట్టుబట్టింది. అయితే మరో మారు తనకే కావాలని దొరబాబు భీష్మించారు. దీంతో ఎమ్మెల్యే కల్పించుకుని పూతలపట్టులోని ఇరువర్గాలను పిలిచి సర్దుబాటు చేశారు. దొరబాబుకు మళ్లీ అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. అందరి సమక్షంలో పూతలపట్టు అధ్యక్షుడిగా దొరబాబే అంటూ ప్రకటించారు. అలాగే ఐరాల మండలంలో హరిబాబునాయుడు, సోమశేఖర్‌నాయుడు అధ్యక్ష పదవికి పోటీపడ్డారు. అయితే హరిబాబునాయుడుకు ఎమ్మెల్యే అధ్యక్ష పదవిని ఏకగ్రీవంగా కట్టబెట్టారు. దీనిని సోమశేఖర్ నాయుడి వర్గం గట్టిగా వ్యతిరేకించింది. ఎమ్మెల్యేతో కుస్తీ పట్టింది. అయినా ఎమ్మెల్యే హరిబాబునాయుడుకి ఇవ్వాలని తీర్మానించి అందరి సమక్షంలో ప్రకటించారు. అయితే ఈ పదవులను అధికారికంగా అధిష్టానం ప్రకటించాల్సి ఉంది. ఈ క్రమంలో సోమశేఖర్‌నాయుడు వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సభలో గందరగోళానికి దిగింది. ఎమ్మెల్యే ఆపండి అంటూ ఆగ్రహానికి గురయ్యారు. దీంతో ఆ వర్గం నోరు మెదపకుండా సభ నుంచి తప్పుకున్నారు. ఆశావహులు భంగపడ్డారు.



గుమిగూడిన ఐరాల మండల నాయకులు